జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ **వార్త** తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ **వార్త** తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 6-11-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 155 పేజీలు: 8 వెల : రూ.7

# అవినీతి పోలీసుల.. చిట్టా రెడీ



* పలు పీఎస్‌లో నెలనెలా మామూళ్లు వసూళ్లు చేస్తున్న కానిస్టేబుళ్లు
* పీఎస్‌ల నిర్వహణకే అంటు దబాయింపు
* ఏకంగా భూదందాలు, సెటిల్‌మెంట్లు చేస్తున్న వైనం
* పోలీస్‌స్టేషన్లు కలియదిరుగుతున్న జిల్లా పోలీస్‌బాస్
* ఇప్పటికే అక్రమార్కులు జాబితా తెప్పించుకున్న బాస్
* కొందరు ఖాకీల్లో కలవరం



**శ్రీకాకుళం క్రైం, నవంబరు 5 (వార్త):** అసాంఘిక శక్తులకు స్వప్నంగా ఉండాల్సిన కొందరు పోలీసులు అన్యాయాలు, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిపోతున్నారు. పోలీస్‌స్టేషన్ నిర్వహణ అంటూ కొందరు రైటర్లు, జనరల్ కానిస్టేబుళ్లు కలెక్షన్లకు దిగారు. ఇసుక, పేకాట, మద్యం, పశువుల తరలింపు, భూ దందా చేస్తున్న వారితో సత్సంబంధాలు పెట్టుకుని కాసులు చేసుకుంటున్నారు. ఎవరైనా నిలదీస్తే మేం తీసుకుంటామా ఏంటి.. అధికారులకు ఇవ్వాలి అని దబాయిస్తున్నారు. జిల్లాలో ఇటీవల బాధ్యతలు చేపట్టి యువ ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఇటు ఇచ్ఛాపురం నుంచి అటు జేఆర్‌పురం పోలీస్‌స్టేషన్ల వరకూ కలియదిరిగారు. ఆకస్మిక తనిఖీలు చేశారు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న సిబ్బందిపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టారని, స్పెషల్ బ్రాంచ్‌తో నివేదికలు తెప్పించుకున్నారని బోగట్టా. అలాగే జిల్లా పోలీసు కార్యాలయంలోనూ అదనంగా ఉన్న సిబ్బందిపై కూడా దృష్టి పెట్టారట. ఈ నివేదిక తన టేబుల్‌పైనే ఉందట. త్వరలో పోలీసుల బదిలీ ప్రక్రియ ఉండడంతో అవినీతికి పాల్పడిన వారిపై చర్యలకు ఉపక్రమించే అవకాశం ఉంది. సమర్థులైన వారిని సీసీఎస్, స్పెషల్ బ్రాంచ్‌లో నియమించే అవకాశం ఉందని జిల్లా పోలీసు కార్యాలయంలో కొందరు అనుకుంటున్నారు. ఇప్పటికే అక్రమాలకు పాల్పడిన పలువురు పోలీసులు రాజకీయ నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. తమను బదిలీల నుంచి తప్పించేలా ముమ్మర యత్నాలు చేసుకుంటున్నారు. శ్రీకాకుళం జిల్లా పోలీసు శాఖలో ఓ కులం డామినేషన్ ఎక్కువగా ఉండడంతో ఆ కులానికి చెందిన పోలీసులు కులం కార్డును వాడుకుని జిల్లా పోలీసు కార్యాలయంలో తిష్ట వేసుకునేలా పకడ్బందీగా ప్లాన్లు వేసుకుంటున్నారు. ఏదేమైనా త్వరలో పోలీసుల బదిలీ ప్రక్రియ జరిగే అవకాశం ఉన్నందున అవినీతికి పాల్పడిన కొందరు ఏం జరుగుతుందోనని బెంబేలెత్తిపోతున్నారు.



* ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి
* వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోండి
* ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి
* పొందూరు పీఎస్ తనిఖీ

# పోలీసులు.. గ్రామాలు సందర్శించండి

**శ్రీకాకుళం క్రైం, నవంబర్ 5 (వార్త):** పోలీసులు ప్రతిరోజూ గ్రామాలను సందర్శించి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం జిల్లా ఎస్పీ పొందూరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. స్టేషన్‌లోని రిసెప్షన్, లాకప్, కంప్యూటర్ గది, రైటర్ రూం, రిసెప్షన్ కౌంటర్లను పరిశీలించారు. పోలీసు స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులు, ఇటీవలి కాలంలో నమోదు కాబడిన ముఖ్యమైన కేసులకు సంబంధించిన ఫైల్స్‌ను తనిఖీ చేశారు. పెడింగ్లో ఉన్న కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని, ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని, కోర్టు ట్రయల్ మానిటరింగ్ ద్వారా కేసులలో శిక్షల శాతం పెంచాలని సిబ్బందికి ఎస్పీ సూచించారు. పాత కొత్త నేరస్థులపై నిఘా ఉంచాలని, మహిళలు, చిన్న పిల్లలపై జరిగే నేరాలు కట్టడి చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు నియంత్రణకు పటిష్టంగా పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ డ్రైవ్ నిర్వహించి ప్రమాదాల నివారించాలన్నారు. ప్రతిరోజు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. సైబర్ నేరాల నియంత్రణ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. దొంగతనాలు, ప్రాపర్టీ నేరాల దర్యాప్తు పూర్తి స్థాయిలో జరిగేలా చూడాలన్నారు. సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. విధినిర్వహణలో సిబ్బంది వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుంటూ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని, ప్రజా ఫిర్యాదు దారులు, బాధితుల పట్ల మర్యాదపూర్వకంగా మాట్లాడాలని సూచించారు.



ఆయన వెంట శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ వివేకానంద, ఆమదాలవలస సీఐ సత్యనారాయణ, పొందూరు ఎస్సై సత్యనారాయణ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం




# పేకాటరాయుళ్ల అరెస్టు

**శ్రీకాకుళం క్రైం, నవంబర్ 5 (వార్త):** జేఆర్‌పురం పోలీస్‌స్టేషన్ పరిధిలో సూరమ్మపేట గ్రామ సమీపంలోని పాతర్లపల్లిలో మంగళవారం సాయంత్రం పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని ఎస్ఐ, సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.97,830 నగదు, తొమ్మిది మొబైల్స్, ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు.





## చేనేత కార్మికులకు అండగా..

# కూటమి ప్రభుత్వం

* చేనేతను ప్రోత్సహిద్దాం
* ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్

**శ్రీకాకుళం/పొందూరు, నవంబర్ 5(వార్త):** చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆమదాలవలస శాసనసభ్యుడు కూన రవికుమార్ అన్నారు. మంగళవారం పొందూరు 1, 2, తోలాపి క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగంగా లబ్ధిదారులకు 65 మగ్గం పనిముట్లు, 12 డాబీలు, 13 మోటరైజ్డ్ పర్న్ వైండింగ్ మెషిన్ తదితర పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేతన్నలను ఆదుకునేందుకు ప్రభుత్వం పలు పథకాలను అమలు చేసిందని, వీటి ద్వారా చేనేత కళాకారులకు మేలు జరిగిందన్నారు. మార్కెట్లో డిమాండ్ ఉంటే రానున్న భావితరాలు చేనేత వస్త్రాలు వాడేందుకు ముందుకు వస్తారని తెలిపారు. అందరం చేనేత వస్త్రాలు వినియోగించి చేనేతని ప్రోత్సహించాలన్నారు. గతంలో పొందూరు ఖాదీకి అవార్డు దక్కిందన్నారు. కార్యక్రమంలో జిల్లా చేనేత జౌళి అధికారి టి జనార్ధనరావు, డీవోలు ఎస్.రమణమ్మ, వి.జి. శంకర రావు, ఆర్. శేఖర్, ఎడిఓ ఎన్.వి.రమణ, క్లస్టర్ సీఈడీలు, పెద్ద ఎత్తున చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# పీఎఫ్ సమస్యలు పరిష్కరించండి

* ఏపీటీఎఫ్ నాయకులు
* జడ్పీ సీఈవోకు వినతిపత్రం

**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 5(వార్త):** జిల్లా పరిషత్ పీఎఫ్ విభాగంలో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు జిల్లా పరిషత్ సీఈవోను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ పీఎఫ్ ఖాతాలలో జమైన సొమ్ము ఎంతో ఉన్నదో తెలుసుకునే బిఎఫ్ స్లిప్పులు వెంటనే విడుదల చేయాలన్నారు. జిల్లా నుంచి విడిపోయిన మండలాల పీఎఫ్ ఖాతాలు క్రమబద్ధీకరణ చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని, ఉద్యోగం చేస్తూ మధ్యలో చనిపోయిన వారికి బూస్టర్ స్కీం వెంటనే పునరుద్ధరించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి, జిల్లా శాఖ అధ్యక్షుడు మజ్జి మదన్మోహన్, ప్రధాన కార్యదర్శి ఎస్వీ అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు పి అప్పలనాయుడు, జి.భీమారావు, బి.ఢిల్లేశ్వరరావు, కార్యదర్శులు చావలి శ్రీనివాస్, ఎస్.చాణిక్య, వి.నవీన్ కుమార్, దాసరి రామ్మోహనరావు, పప్పల తిరుమలరావు, రాష్ట్ర కౌన్సిలర్లు ఎన్.నీలామోహన్‌రావు, పి.శ్రీరామ్మూర్తి, ఆడిట్ కమిటీ సభ్యుడు సదాశివుని శంకరరావు ఉన్నారు.





## పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై శిక్షణ

**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 5(వార్త):** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ నిధులతో పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీ ప్రక్రియకు సంబంధించి మంగళవారం శ్రీకాకుళం జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 21 మండలాలకు సంబంధించిన ఎంపీడీవోలు, పంచాయతీ విస్తరణాధికారులకు ఈ శిక్షణ రెండు రోజులు పాటు ఇవ్వనున్నారు. ప్రతి మండలం నుండి ఇద్దరు చొప్పున పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ అందించనున్నారు. ఈ శిక్షణా కార్యక్రమం ప్రారంభోత్సవంలో ఏపీఎస్ఐఆర్డి కృష్ణ మోహన్, డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ శ్రీధర్ రాజా, జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో డి.సత్యనారాయణ, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ నిశ్చల, ఎస్.లోకనాధరావు పాల్గొన్నారు.

## వాడవాడలా నాగులచవితి

**శ్రీకాకుళం టౌన్, నవంబరు 5 (వార్త):** జిల్లాలో నాగుల చవితి వేడుకలు మంగళవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తులు కుటుంబాలతో కలిసి సంప్రదాయ దుస్తులు ధరించి పాముల పుట్టల వద్దకు వెళ్లారు. పుట్టకు పూజలు చేసి, నువ్వులు, చలివి పిండి, పాలు, గుడ్లను వేశారు. అనంతరం శైవక్షేత్రాల్లో పూజలు నిర్వహించారు.

## నాగులచవితి వేడుకల్లో సూరిబాబు కుటుంబం

**శ్రీకాకుళం టౌన్, నవంబరు 5 (వార్త):** నగరంలోని 31 డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ విభూది సూరిబాబు మంగళ వారం భక్తి శ్రద్ధలతో నాగులచవితి వేడుకలు నిర్వహించుకున్నారు. జిల్లా పరిషత్‌లో గల పుట్టలో చిన్న కుమార్తె డాక్టర్ తేజస్విని, అల్లుడు డాక్టర్ శేషు కుమార్‌తో కలిసి సూరిబాబు దంపతులు పూజలు చేశారు. పుట్టలో పాలు, గుడ్లు పోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాగేంద్రుని కృపా కటాక్షాలు అందరికీ ఉండాలని ఆకాంక్షించారు.





# 9 నాటికి నీటి సంఘాల ఓటరు జాబితా

* త్వరలో నీటి సంఘాలకు ఎన్నికలు
* సమస్యాత్మక గ్రామాలను గుర్తించండి
* కోర్టు కేసులు పరిష్కరించాలి
* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
* వివిధ శాఖల అధికారులతో సమీక్ష

**శ్రీకాకుళం, నవంబర్ 5(వార్త):** నీటి యాజమాన్య సంఘాల ఓటరు జాబితాలను ఈనెల 9వ తేదీ నాటికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. త్వరలో జరగనున్న నీటి సంఘాల ఎన్నికల నాటికి ఎటువంటి పెండింగ్ పనులు లేకుండా ముందస్తు చర్యలలో భాగంగా ఓటరు జాబితాను సిద్ధం చేయాలన్నారు. వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏపి సేవా, మీసేవ, పి.జి.ఆర్.ఎస్ సంబంధించిన రెవెన్యూ, గృహ నిర్మాణ సంస్థ, సిపిఓ, రహదారులు భవనములు, విద్యా, పంచాయతీ, ఉద్యాన, ఎపిఈపిడిసియల్, డ్వామా, ఐసిడిఎస్, వైద్య ఆరోగ్య శాఖలకు సంబంధించి పెండింగ్లో వున్న మీకోసం (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక) అర్జీలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నాణ్యతతో కూడిన పరిష్కారాలపై కలెక్టర్ సమీక్షించారు. నీటి యాజమాన్య సంఘాల ఎన్నికల నిర్వహణపై ఎస్ఈ ఇరిగేషన్ చేపట్టిన పనులపై కలెక్టర్ ఆరా తీశారు. ఇరిగేషన్ ఎస్ఈ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామన్నారు. తహసీల్దార్‌లు ఓటర్ల లిస్టులను సిద్ధం చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల నిర్వహణకి గెజిటెడ్ ఆఫీసర్ అవసరమని అలాగే ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాలు గుర్తించాలన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ నాటికి జాబితాలు సిద్ధం చేయడంపై తహసీల్దార్లకు సూచించారు. నిర్వహణలో ఏమైనా అనుమానాలుంటే నివృత్తి చేసుకోవాలని ఈ నెల 9వ తేదీ నాటికి జాబితాలు సిద్ధం కావాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి సమస్యాత్మక గ్రామాలుంటే గుర్తించాలన్నారు. ఆర్అండ్‌బి పరిధిలో కోర్టు కేసుల పెండింగ్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మన ఇల్లు మన గౌరవం సమీక్షలో భాగంగా జిల్లా కలెక్టర్ గృహ నిర్మాణ సంస్థ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో గృహ నిర్మాణాలపై శ్రద్ధ చూపాలని, మండల ప్రత్యేక అధికారులు ఏంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్లు సమన్వయంతో గృహ నిర్మాణం పనులు వేగవంతమయ్యేలా చూడాలన్నారు. లేఔట్లలో తాగునీరు, విద్యుత్ సంబంధిత మౌలిక వసతులు కల్పించేందుకు త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు. సూర్య ఘర్ పథకం అమలుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో అపార్ ఐడి కార్డు నిర్వహణపై కలెక్టర్ ఆరా తీవారు. జిల్లా విద్యాశాఖధికారి తిరుమల చైతన్య మాట్లాడుతూ జిల్లాలో నేటికీ 60.679 శాతం పూర్తి చేయడం జరిగిందన్నారు. గవర్నమెంట్ అఫ్ ఇండియా అపార్ ఐడి కార్డు వెబ్ సైట్లో విద్యార్థుల ఆధార్ కార్డుతో పాటే పూర్తి వివరాలు అప్లోడ్ చేయాలన్నారు. అపార్ ఐడి కార్డు విద్యార్థులకు చాలా కీలకమన్నారు. విద్యార్థి పూర్తి వివరాలు పొందుపరచి ఉంటాయన్నారు. ప్రభుత్వం, ప్రయివేట్ విద్యా సంస్థలు, మండలం విద్యాశాఖ అధికారులు అందరూ అప్లోడ్ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో సోంపేట, పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లో అపార్ ఐడి కార్డు పనులు మందకొడిగా సాగుతున్నాయని వేగవంతం చేయాలన్నారు. శ్రీకాకుళం మునిసిపల్ కమిషనర్ ప్రయివేట్ పాఠశాల యాజమాన్యంతో ఒక సమావేశం ఏర్పాటు చేసి అపార్ ఐడి కార్డులు వేగవంతం చేయాలన్నారు. పంచాయతీ శాఖ సమీక్షా నిర్వహిస్తూ డ్రైన్స్, గార్బజింగ్ హెప్స్, పోస్టింగ్స్ అఫ్ గ్రీన్ అంబాసిడర్స్ పై ఆరా తీశారు. జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య కలెక్టర్‌కు వివరించారు. ఉద్యాన ఆయిల్ పామ్, క్యాజు, క్రాప్ ఇన్సూరెన్స్, ఎపిఎపిడిసియల్ పి.ఎం సూర్య ఘర్, డ్వామా పల్లెపండుగ, ఐసిడిఎస్ అంగన్వాడీ, వైద్య ఆరోగ్య శాఖ సీజనల్ వ్యాధులు, ఫీవర్ సర్వేపై కలెక్టర్ సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, డ్వామా పిడి సుధాకర్, ఐసిడిఎస్ పిడి శాంతిశ్రీ, జిల్లా ఉద్యాన అధికారి ఆర్ వరప్రసాద్, ఇరిగేషన్ ఎస్ఈ సుధాకర్, జిల్లా వ్యవసాయఅధికారి, టెక్కలి, పలాస, శ్రీకాకుళం ఆర్డీఓలు, మునిసిపల్ కమిషనర్లు, మండలాల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్, ఎంపిడిఓ, మండలం విద్యాశాఖాధికారులు సంబంధిత అధికారులు సంబంధిత మండలాల నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## విరాట్ కోహ్లీ జన్మదిన వేడుకలు



**ఇచ్ఛాపురం, నవంబర్ 5(వార్త) :** భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ జన్మదిన వేడుకలు మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఇచ్ఛాపురంలోని నీలకంటేశ్వర వీధిలో అక్కడి యువత కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. కార్యక్రమంలో గుజ్జు సుందర్, కె.శ్రీను, వివేక్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# పలాస ప్రశాంతతను చెడగొట్టొద్దు

- రాక్షస పాలన పోయి చంద్రన్న పాలన వచ్చింది
- సీదిరి రెచ్చిపోతే మూల్యం తప్పదు
- ఏపీటీఎఫ్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు హితవు




**కాశీబుగ్గ, నవంబర్ 5(వార్త):** రాష్ట్రంలో రాక్షస పాలన పోయి చంద్రన్న పాలన వచ్చిందని, పలాస నియోజకవర్గం ప్రశాంతతకు మారుపేరుగా నిలుస్తుందని ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు అన్నారు. మంగళవారం ఆయన టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి హయాంలో చేసిన అసాంఘిక, అవినీతి, కక్ష పూరిత, దౌర్జన్యాలు, కార్యక్రమాలపై మాట్లాడడానికి మాటలు, రాయడానికి పుస్తకాలు చాలవని ఈ విషయం తెలుసుకొని మాట్లాడండి అని మండిపడ్డారు. ఎంత పెద్ద ఆఫీసర్ కైనా తమాషా చేస్తున్నావా.. చొక్కా పట్టలాగేస్తాను అన్న మాటలు మర్చిపోయావా.. ఇలాంటి మాటలకే ప్రజలు ఛీ కొట్టారన్నారు. టీడీపీ కార్యకర్తలపై రెచ్చిపోతున్న వైసీపీ కార్యకర్తలకు మూల్యం తప్పదన్నారు. ప్రాంతాల వారీగా చేస్తున్న అభివృద్ధికి సహాయపడాలని హితవు పలికారు. లొడగల కామేష్ యాదవ్ మాట్లాడుతూ గత ఐదేళ్లు వైసీపీ చేసిన పాపాలే నేడు ప్రజలకు శాపంగా మారిందన్నారు. పోలీస్ స్టేషన్కు పసుపు రంగు వేస్తారా, ప్రైవేట్ పోలీస్‌స్టేషన్లు పెట్టిస్తారా అది ఎలా సాధ్యం, ఎలా జరుగుతుంది అంతా మీ ఇష్టానుసారం అనుకుంటున్నారా లేక అధికారంలో మేమే ఉన్నామని గర్వపడుతున్నారా. ఇటువంటి మాటలు మాట్లాడితే ప్రజలు దుమ్మెత్తిపోస్తారన్నారు. బడ్డ నాగరాజు మాట్లాడుతూ మీ హయాంలో ఎన్నో అల్లర్లు సృష్టించారని సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టించడం, గంజాయి అమ్మినట్లు కేసులు పెట్టించడం, అలాగే తన ఇంటికి వెళుతున్న దారి తవ్వించేయడం, లక్కోజీ వినోద్‌పై తప్పుడు కేసు పెట్టించడం ఇలాంటివి ఎన్నో చేయించారు. సినిమాకి వెళ్తే టిక్కెట్లు, డ్రింకులు, సమోసాలు డిపార్ట్మెంట్ వారు తెచ్చివ్వాలి. డిపార్ట్మెంట్ వారికి ఆ విధంగా వినియోగించుకున్నారని ఆరోపించారు. సప్ప నవీన్ మాట్లాడుతూ గతంలో మీరు పెట్టించిన కేసులపై మేము తప్పు చేశామని రుజువైతే రాజకీయాలు వదిలేస్తామని మాజీ మంత్రి అప్పలరాజుకు సవాల్ విసిరారు. తప్పుడు కథనాలతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా హుందాగా రాజకీయాల చేస్తూ అభివృద్ధికి సహకరించాలని హితవు పలికారు. కార్యక్రమంలో గాలి కృష్ణారావు, సవర రాంబాబు, రవిశంకర్ గుప్త, సాశుమాన చంద్రమౌళి, పైల చక్రధర్, అంబటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ మహిళలపై దాడి చేసిన వారిని శిక్షించాలి



**మందస, నవంబర్ 5(వార్త):** జలుమూరు మండలం ఎస్టీ మాకివలస గ్రామంలో తరతరాలుగా జీవిస్తున్న ఆదివాసీలకు రక్షణ కల్పించాలని, వారి భూములు పరిరక్షించాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర కోశాధికారి కోనేరు రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మందసలో విలేఖరులతో మాట్లాడారు. దశాబ్దాలుగా మాకివలసలో జీవిస్తున్న ఆదివాసులపై దౌర్జన్యం చేసి, వారి భూములు కొందరు కబ్జా చేయాలని చూడడం దారుణం అన్నారు. సమస్య ఎస్టీ కమిషన్ విచారణలో ఉండగా రాత్రికి రాత్రే మగాళ్లు లేని సమయంలో మాకివలస ఆదివాసులపై దౌర్జన్యం చేసి, వారిపై దాడి చేయడం అమానుషమన్నారు. ఆదివాసీల రక్షణకు ఎన్ని చట్టాలు ఉన్నా పాలకులు అండదండలతో అక్రమార్కులు ఆదివాసీల భూములను కాజేస్తున్నారని ఆరోపించారు. మాకివలస ఆదివాసీలు తరతరాలుగా బడి, శ్మశానం వంటి వసతులను నిర్మించుకుని ఎన్నో ఏళ్లుగా జీవిస్తుండగా, తప్పుడు దస్త్రాలతో ఆదివాసులపై దౌర్జన్యానికి దిగడం సరైనది కాదన్నారు. ఆదివాసీల భూములు ప్రైవేటుపరం ఎలా అవుతాయని ప్రశ్నించారు. 1/70 యాక్ట్ ప్రకారం ఆ భూములు గిరిజనేతర భూములుగా ఎలా అవుతాయన్నారు. మాకివలస సమస్యపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని, నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని కోరారు. ఆదివాసీలపై దాడులు చేస్తున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుని అరెస్టు చేయాలని, ఎన్నో ఏళ్లుగా అనుభవిస్తున్న వారి భూములను పరిరక్షించాలని, ఆ భూములపై ఆదివాసులకి పట్టాలు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఆదివాసీలు తమ హక్కుల కోసం, తమ భూములు కాపాడుకోవడం కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

# ఓటరు నమోదులో సమస్యలను పరిష్కరించండి



**మందస, నవంబర్ 5(వార్త):** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదులో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ మందస మండల నాయకులు తహసీల్దార్‌ను కోరారు. ఈ మేరకు వారు ఆమెకు వినతిపత్రం అందజేశారు. ఓటరు నమోదులో ఉన్నత పాఠ శాల స్థాయిలో వివిధ ఉపాధ్యాయులు ప్రస్తుతం పనిచేస్తున్న డీడీవో నుంచి సర్వీస్ సర్టిఫికెట్ సమర్పిస్తున్నారన్నారు. కానీ గత 6 ఏళ్లలో 3ఏళ్ల సర్వీస్ ఎక్కడ ఉంటే అక్కడ నుంచి సర్టిఫికెట్ తెమ్మనంటున్నారన్నారు. ఇది సరి కాదన్నారు. ప్రస్తుత డీడీవో వద్దే వారి సర్వీస్ మొత్తానికి సంబంధించి సేవా పుస్తకం ఉంటుందని, వారి సంతకంతో ఉన్న సర్వీస్ సర్టిఫికెట్‌ని అనుమతించాలని కోరారు. ఓటరు నమోదుకు చివరి తేదీ ఈ నెల 6న కావడంతో ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. దరఖాస్తు సమర్పించిన వారికి రశీదు విధిగా అందజేయాలని కోరారు.

కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గవ్వ భీమారావు, మండల ప్రధాన కార్యదర్శి కర్రి సుందరరావు, కార్యవర్గ సభ్యులు ఎన్.కరుణాకర్, సుశాంత్‌కుమార్ రౌలో, డి.వైకుంఠరావు, బి.తిరుపతిరావు, డి.చంద్రశేఖర్, ఎస్.గణేశ్వరరావు, బి.రామారావు పాల్గొన్నారు.




## మహాసభలను జయప్రదం చేయండి

**పలాస, నవంబర్ 5(వార్త):** పలాసలో ఈ నెల 9 నుంచి జరిగే సీపీఎం 18వ మహాసభలను చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, కార్యవర్గ సభ్యులు మోహన్‌రావు పిలుపు ఇచ్చారు. మంగళవారం వారు పలాసలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సముద్ర తీర ప్రాంతంలో కారిడార్ల పేరుతో రైతుల భూములను కార్పొరేట్ వర్గాలకు కట్టబెట్టడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో ఆ పార్టీ నేతలు పాల్గొన్నారు.

## ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు




**పలాస, నవంబర్ 5(వార్త):** పలాస -కాశీబుగ్గ మున్సిపాలిటీ 11వ వార్డులో మంగళవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా సాగింది. ఇప్పటికే సుమారు 130 టీడీపీ సభ్యత్వ నమోదు చేసుకున్నారని, ప్రతి కార్యకర్తకు టీడీపీ సభ్యత్వ నమోదు ప్రాముఖ్యత వివరిస్తున్నామని ఆ పార్టీ ఇన్‌చార్జి చంద్రశేఖర్ త్యాది తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లోడగాల కామేశ్వరరావు రావు, కొవ్వూరి సురేషకుమార్, జన, రాము పండా, రాజేష్, భాస్కర్, దీపు, లోకి పాల్గొన్నారు.

## మద్యం అధిక ధరలకు అమ్మితే చర్యలు



**జలుమూరు, నవంబర్ 5(వార్త):** మద్యాన్ని ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్ర యిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ శాఖ సీఐ రమణమూర్తి తెలిపారు. మద్యం దుకాణం వద్ద ధరలు పట్టిక ఏర్పాటు చేశామన్నారు. 21 ఏళ్ల లోపు వారికి మద్యం విక్రయించవద్దని యాజమాన్యాలకు సూచించారు. ఒక వ్యక్తికి మూడు సీసాలు మించి ఇవ్వకూడదన్నారు. బెల్ట్ షాపులకు మద్యం తరలిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## 'జీవో 7 ద్వారా వేతనాలు చెల్లించండి'

**జలుమూరు, నవంబర్ 5(వార్త):** రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్-7 ద్వారా మాత్రమే వేతనాలను చెల్లించాలని 104 సిబ్బంది డిమాండ్ చేశారు. మంగళవారం వారు జలుమూరు మండలం సైరిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి గురునాథానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డీఈవోలు సీహెచ్ శ్రీధర్, బి.బాలకృష్ణ, లక్ష్మణ మాట్లాడుతూ మూడు నెలలుగా తమకు వేతనాలు కూడా చెల్లించలేదని వాపోయారు. ఇప్పటికైనా స్పందించి తమ వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో 104 సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ శ్రీకర్ సస్పెండ్

**నరసన్నపేట, నవంబర్ 5(వార్త):** నరసన్నపేటలోని స్థానిక ఎస్‌బీఐ బజార్ బ్రాంచ్ బీఎంగా గతంలో పనిచేసిన శ్రీకర్‌ను సస్పెండ్ చేస్తూ బ్యాంకు అధికారులు సోమవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. గతంలో ఈ బ్యాంకులో జరిపిన లావాదేవీల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని నిర్ధారణ కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉద్యోగులకు తెలియకుండా వారి డాక్యుమెంట్లను సొంత ప్రయోజనాలకు వాడుకున్నట్లు రుజువైనట్లు తేలిందన్నారు.

## పత్రాలు లేని రెండు ట్రాక్టర్లు స్వాధీనం

**నరసన్నపేట, నవంబర్ 5(వార్త):** నరసన్నపేట మండలం తామరాపల్లి పరిధిలో జాతీయ రహదారిపై రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు టెక్కలి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంజీవరావు తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహిస్తుండగా..ఎటువంటి పత్రాలు, లైసెన్స్ లేని వారిని గుర్తించి వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ట్రాక్టర్లను నరసన్నపేట పోలీస్‌స్టేషనుకు తరలించినట్లు ఆయన స్పష్టం చేశారు.



## 'జ్వరాలపై అప్రమత్తం'

**నరసన్నపేట, నవంబర్ 5(వార్త):** గ్రామాలలో వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నాయని, రోగులు అప్రమత్తంగా ఉండాలని మాకివలస వైద్యాధికారి విజయ్‌కుమార్ సూచించారు. నరసన్నపేట మండలం జమ్ము పంచాయతీలో మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ఎక్కువగా జ్వరాలు, ఒంటి నొప్పులతో బాధపడుతున్న వారికి చికిత్స అందించామని తెలిపారు. వీరు తగిన జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రెల్లివలస గ్రామసభలో 21 అర్జీల స్వీకరణ



**నరసన్నపేట, నవంబర్ 5(వార్త):** నరసన్నపేట మండలం రెల్లివలస రెవెన్యూ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో 21 మంది రైతులు అర్జీలను సమర్పించారని డిప్యూటీ తహసీల్దార్ గుండ కృష్ణ, సర్వేయర్ అప్పలస్వామి తెలిపారు. మంగళవారం ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో వారు మాట్లాడారు. రైతుల వద్ద ఉన్న పట్టాదారు పాస్ పుస్తకాలలో ఎటువంటి మార్పులు, చేర్పులు కావాలన్నా తమకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## నేడు క్యాన్సర్ మెగా స్క్రీనింగ్ శిబిరం



**ఇచ్ఛాపురం, నవంబర్ 5(వార్త) :** రైజ్ సంస్థల అధినేత ప్రవీణ్ పుల్లట ఆధ్వ ర్యంలో మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ సౌజన్యంతో బుధవారం మహిళలకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సీపాన వెంకటరమణ, పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నందికి జానీ రెడ్డి తెలి పారు. ఎమ్మెల్యే బెందాళం అశోక్ శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు. ప్రభుత్వ ఆసు పత్రి ఆవరణలో మహిళలకు పరీక్షలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## 104 సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి

**సారవకోట, నవంబర్ 5(వార్త):** తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లాలోని 104 సిబ్బంది డిమాండ్ చేశారు. మంగళవారం వారు విలేఖరులతో మాట్లాడారు. తమకు గత మూడు నెలలుగా జీతాలు అందడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు వస్తున్న జీతాల్లో పీఎఫ్ పేరిట ఒక ప్రైవేట్ కంపెనీ డబ్బులను జమ చేసుకుంటోందని, వాటిని విడుదల చేయాలలని వారు కోరారు. అనంతరం సారవకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి దేవికకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో 104 సిబ్బంది పాల్గొన్నారు.



# క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం



**కాశీబుగ్గ, నవంబర్ 5(వార్త):** క్రీడాకారులకు నూతన ఉత్తేజం కలిగించేలా రిజర్వేషన్‌ను 3% పెంచిన ప్రభుత్వానికి జాతీయ బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, శ్రీకాకుళం జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అధ్యక్షుడు, పలాస మున్సిపల్ మాజీ చైర్మన్, జనసేన నాయకులు కోత పూర్ణచంద్రరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో హర్షించతగ్గదన్నారు. క్రీడాకారులు చైతన్యవంతం కావడానికి దోహదపడుతుందన్నారు. చదువుతో పాటు క్రీడలు కూడా యువత భవిష్యత్‌కి ఎంతో ఉపయోగకరమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలోని కోడి రామ్మూర్తి స్టేడియం, అనేకచోట్ల క్రీడా మైదానాలను సిద్ధం చేసి భారత దేశంలో ఆంధ్రప్రదేశ్ ముందుండాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో జిల్లా క్రీడాకారులు ముందంజలో ఉండాలని, క్రీడాకారులకు ఇదొక గొప్ప సదవకాశం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒలింపిక్స్‌లో పతకం సాధించిన క్రీడాకారులకు రూ.7 కోట్ల నజరానా ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. మండల, నియోజకవర్గ స్థాయిలో క్రీడా వికాస కేంద్రాలు, పంచాయతీ స్థాయిలో క్రీడా మైదానాల ఏర్పాటుకి అధికారులకు ఆదేశించడం సంతోషికదగ్గ విషయమన్నారు. గిరిజనుల కోసం ప్రత్యేకంగా క్రీడా పాఠశాల ఏర్పాటు చేయడం, జాతీయస్థాయిలో బంగారు పతకం సాధిస్తే రూ.10 లక్షలు, రజతానికి రూ.5లక్షలు, కాంస్యానికి రూ.3 లక్షల ప్రోత్సాహకాలు అందించడం ముదావహమన్నారు. ఒలింపిక్స్, ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన వారికి గ్రూప్ 1 ఉద్యోగాలు కల్పించడం ఆనందదాయకమన్నారు. జిల్లాలోని పాత్రునివలసలో 33 ఎకరాల్లో క్రీడా గ్రామం నిర్మించడానికి ఖేలో ఇండియా ప్రాజెక్టు ప్రతిపాదించడం ఎంతో ప్రోత్సాహకారమన్నారు. ఇందులో ఇండోర్‌కి రూ.14 కోట్లు, హాకీ, ఈత కొలనులు నిర్మించడానికి రూ.8 కోట్లు, సింథటిక్, అథ్లెటిక్ టాక్ నిర్మాణానికి రూ.40 లక్షల కేటాయించడంలో అన్ని విధాలా సహకరించిన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు,రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి మండిపిల్లి రాంప్రసాద్ రెడ్డి, రాష్ట్ర శాప్ చైర్మన్ రవినాయుడుకు జిల్లా క్రీడాకారుల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ చక్కని అవకాశాన్ని యువత సద్వినియోగపరచుకోవాలని, రాష్ట్రానికి వన్నె తేవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

# పాముల సయ్యాట



**కాశీబుగ్గ, నవంబర్ 5(వార్త):** పలాసలో నాగుల చవితి పర్వదినాన సర్పాల సయ్యాటలాడిన దృశ్యాన్ని ప్రజలు తిలకించి పులకించారు. సూర్య కాలనీలో నాగుపాముల సయ్యాట చూపరులను ఆక ట్టుకుంది. నాగులచవితిని పురస్కరించుకొని పుట్టలో పాలు వేసేందుకు అటుగా వెళ్లిన భక్తులకు రెండు పాములు సయ్యాటలతో ప్రత్యక్షమయ్యాయి. ఒక దానితో ఒకటి పెన వేసుకుని పావుగంట పాటు సయ్యాట లాడి ప్రజ లకు కనులవిందు చేశాయి. నాగసర్పాల సయ్యాటను చూసిన భక్తులు వాటికి సమీపంలోనే తెల్లని వస్త్రం పరిచి సలివిడి, చిమ్మిలి, పాలు, పాయసం, గుడ్లు నైవే ద్యంగా సమర్పించి, పూజలు జరిపారు.

# విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి



**సంతబొమ్మాళి, నవంబర్ 5(వార్త):** ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న వేరుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సంతబొమ్మాళి మండల పరిషత్ మాజీ అధ్యక్షులు చిదపాన ధర్మార్జునరెడ్డి, కర్రి విష్ణుమూర్తి రైతులకు పిలుపునిచ్చారు. మంగళవారం వారు సంతబొమ్మాళిలో రబీ పంట కాలానికి గాను రాయితీ వేరుశనగ విత్తన పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మునుపెన్నడూ లేనివిధంగా రాయితీపై నాణ్యమైన వేరుశనగ విత్తనాలను రైతులకు సకాలంలో అందుబాటులోకి తేవడంలో కృషిచేసిన వ్యవసాయ శాఖా మాత్యులు అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. మండల వ్యవసాయాధికారి రాళ్లపేట అప్పారావు మాట్లాడుతూ రాయితీ వేరుశనగ విత్తనం కావాల్సిన రైతులు వారి పట్టాదారు పాసు పుస్తకాలు, ఆధార్ కార్డులతో తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జీరు భీమారావు, ప్రధాన కార్యదర్శి రెడ్డి అప్పన్న, అభ్యుదయ రైతులు కూచెట్టి కాంతారావు, మెండ అప్పారావు, చల్ల జగ్గారావు, తంగి రమణమూర్తి, ప్రసాదరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు దేవాది సాయిరాజు, బాలక సాయి కిశోర్, రైతులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ప్రశ్నించే గొంతులను నొక్కేస్తారా: కృష్ణదాస్



**నరసన్నపేట, నవంబర్ 5(వార్త):** వైఎస్సార్సీపీ సోషల్ మీడియాపై ప్రభుత్వం కక్ష కట్టి కేసులు పెడుతోందని జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. కృష్ణా జిల్లాలో ఆదివారం ఒక్కరోజే 42 కేసులు పెట్టారని మండిపడ్డారు. జిల్లాలో కూడా తమ సోషల్ మీడియా కార్యకర్తలను స్టేషన్లకు పిలిపించి వేధిస్తున్నారని. ప్రశ్నించే గొంతులను నొక్కేస్తారా అంటూ విమర్శించారు. ప్రభుత్వం చేస్తున్న అక్రమాలపై ప్రశ్నిస్తే, కేసులు పెడుతున్నారని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను కూడా పక్కనపెట్టి పోలీసులు వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. ఎవరి మెప్పుకోసం ఈ కేసులు బనాయిస్తున్నారని, ఎల్లకాలం అధికారం ఒక్కరికే ఉండదని గుర్తుంచుకోవాలని హితవు పలికారు.



**పలాస, నవంబర్ 5(వార్త):** నాగులచవితి పండుగను మంగళవారం పలాస ప్రజలు కుటుంబసభ్యులతో భక్తి, శ్రద్ధలతో జరుపుకున్నారు. హిందూ సంప్రదాయలను పాటిస్తూ.. ఉదయాన్నే పాలు, పాయసం, పసుపు, కుంకుమ, చలివిడి, చిమ్మిలి, పండ్లు, పువ్వులు, గుడ్లను పుట్టకు సమర్పించి, పూజాదికాలు నిర్వహించారు. నాగరాజా... నీ చల్లని దీవెనలతో మమ్మల్ని కాపాడంటూ ఆరాధించారు. బాణసంచా కాల్చి పుట్టల వద్ద సందడి చేశారు. నాగుల చవితి శోభతో భక్తి పారవశ్యంతో పులకించారు.



**సంతబొమ్మాళి, నవంబర్ 5(వార్త):** నౌపడ, భావనపాడు, లక్కివలస, బోరుభద్ర, సంతబొమ్మాళి దండు గోపాలపురం తదితర గ్రామాల్లోని ప్రజలు మంగళవారం నాగులచవితి వేడుకలు ఘనంగా జరిపారు. ఈ పర్వదినాన నాగేంద్రుడికి ఇష్టమైన పాలు, గుడ్డు, చలివిడి ముద్దలను పుట్టలో వేసి నైవేద్యం సమర్పించారు. నాగేంద్రునికి పాలు పోస్తే సర్వదోషాలు పోతాయని తాతల కాలం నుంచి వస్తున్న నమ్మకాన్ని ఆచరించారు. ప్రతి పల్లెలో పొద్దున్న సరికే పుట్టల వద్ద ఎక్కడ చూసినా పండగ వాతావరణంతో సందడి నెలకొంది. కుటుంబాల సమేతంగా పుట్టల వద్దకు వెళ్లి కాపాడాలంటూ మండల వాసులు నాగేంద్రుడిని వేడుకున్నారు. పుట్టల వద్ద ప్రసాదాలు ఒకరికి ఒకరు పంచుకుంటూ ఆనందంగా గడిపారు. చిన్నారులు, యువకులు బాణాసంచా కాల్చి సందడి చేశారు. సాయంత్రం సమయాన పొలానికి వెళ్లి చూస్తే పంటకు మంచి జరుగుతుందనే నమ్మకంతో రైతులు పొలాల బాట పట్టారు.

# నాగరాజా..అందుకో.. మా పూజ..!

- భక్తి, శ్రద్ధలతో గ్రామగ్రామాన నాగుల చవితి వేడుకలు
- పుట్టల వద్ద కుటుంసభ్యులతో కలిసి ఘనంగా పూజలు
- చల్లగా చూడాలని ప్రార్థనలు



**కాశీబుగ్గ, నవంబర్ 5(వార్త):** కాశీబుగ్గలో నాగుల చవితి పండుగను మంగళవారం ప్రజలు కుటుంబ సభ్యులతో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. హిందూ సంప్రదాయలను పాటిస్తూ..ఉదయాన్నే పాలు, పాయసం, పసుపు, కుంకుమ, చలివిడి, చిమ్మిలి, పండ్లు, పువ్వులు, గుడ్లను పుట్టకు సమర్పించి, పూజాదికాలు నిర్వహించారు. నాగరాజా... నీ చల్లని దీవెనలతో మమ్మల్ని కాపాడంటూ ఆరాధించారు.

నాగుల చవితి రోజున పల్లె ప్రాంతాల్లో పొలాలకు వెళ్లడం ఆనవా యితీ. ఎంతో శ్రమించి వరి పండించిన అన్నదాతలు కుటుంబసభ్యులతో ఇంటి వద్ద ప్రత్యేక వంటకాలు తయారు చేసుకొని దైవానికి నైవేద్యంగా పెట్టి కుటుం బసభ్యులు, స్నేహితులు, బంధువులతో అరగించారు. బాణసంచా కాల్చి పుట్టల వద్ద సందడి చేశారు.



ఘనంగా నాగుల చవితి వేడుకలు.

**వంగర, నవంబర్ 5(వార్త):** వంగర, అరసాడ, మద్దువలస, కొప్పర, సంగాం తదితర గ్రామాల్లోని ప్రజలు మంగళవారం నాగులచవితి వేడుకలు ఘనంగా జరిపారు. ఈ పర్వదినాన నాగేంద్రుడికి ఇష్టమైన పాలు, గుడ్డు, చలి విడి ముద్దలను పుట్టలో వేసి నైవేద్యం సమర్పించారు. నాగేంద్రునికి పాలు పోస్తే సర్వదోషాలు పోతాయని తాతల కాలం నుంచి వస్తున్న నమ్మకాన్ని ఆచరించారు. ప్రతి పల్లెలో పొద్దున్న సరికే పుట్టల వద్ద ఎక్కడ చూసినా పండగ వాతావరణంతో సందడి నెలకొంది. కుటుంబాల సమేతంగా పుట్టల వద్దకు వెళ్లి కాపాడాలంటూ మండల వాసులు నాగేంద్రుడిని వేడుకు న్నారు. పుట్టల వద్ద ప్రసాదాలు ఒకరికి ఒకరు పంచుకుంటూ ఆనందంగా గడిపారు. చిన్నారులు, యువకులు బాణసంచా కాల్చి సందడి చేశారు.



**మందస, నవంబర్ 5(వార్త):** నాగులచవితిని ఎంతో భక్తి, శ్రద్ధలతో ప్రజలు జరిపారు. నువ్వులు, బియ్యం పిండితో చేసిన చలిమిడితో పాటు పువ్వులు, పసుపు, కుంకుమ, ఎర్రమట్టి, ముగ్గుపిండి లతో పుట్టల వద్దలకు వెళ్లి, పాలు పోసి, ప్రసా దాలను నివేదించి ప్రార్థనలు చేశారు. నాగుల చవితి రోజున గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు సాయంత్రం వేళల్లో పొలాలకు వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. కుటుంబ సభ్యులతో సహా పంటలను తిలకించడానికి వెళ్లారు. ఆరుగాలం కష్టపడి పండించుకునే పంటలను చూసి రైతులు ఆనంద పడ్డారు. ఇదిలా ఉంటే నాగరాజుకు నాటు కోడిగుడ్లు ఇష్టమని నమ్మే భక్తులు కోడిగుడ్లు సేకరించారు. దీంతో వీరి ధరలు గతం కన్నా కొంత ఎక్కువగా పలికాయి.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413